

# పిట్టు మారింది

ముత్తా దుర్గాప్రసాద్

ఊరు కదిలింది.

రెండెడ్ల బండ్లు నూటయాభైకి పైగా వరసగా నిలబడి ఉన్నాయి ఊరి ముందు. పిల్లాజెల్లా తట్టాబుట్టా బండిలోకి సర్దేసి ఆడవాళ్లంతా బళ్లెక్కి కూర్చున్నారు. మగాళ్లు రెండు వందలమందికి పైగా అటూ ఇటూ తిరుగుతూ నానాహంగామా చేస్తున్నారు.

"ఇహ కదుల్దామా!" అన్నాడు రంగయ్య.

"మేమంతా తయారే" అన్నారు జనం.

అందర్నీ వదిలేసి ఒక్కసారి మళ్లీ ఇంట్లోకి పోయి, నలుదిక్కులూ చూశాడు రంగయ్య. తలుపులూ కిటికీలూ పీకేశాక మొండిపడిపోయిన గోడలు నెత్తి మీద కప్పు లేకుండా దిగాలుపడి చూస్తూ ఉన్నయ్. నట్టింట్లో చెత్తాచెదారం కుప్పలు కుప్పలుగా పడి ఉంది. దొడ్లోకి పోతే, గిలకలు పీకేసిన నుయ్యి మూగగా ఏడుస్తూంది. ఇహ అక్కడ నిలబడలేక బయటికి పరుగెత్తాడు రంగయ్య.

అక్కడా అంతే!

బోసి గోడల కొట్టంఎదుట అడ్డూ ఆపూ లేకుండా పెరిగిపోయిన వేపచెట్టుచుట్టూ నున్నటి రాతిబండలు

"తల్లీ! మహలక్ష్మీ! క్షమించు. రెండు వందల సంవత్సరాల ఈ గ్రామచరిత్ర ఇంతటితో ముగిసిపోయింది. ఆశీర్వదించి పంపమ్మా!" గద్గదస్వరంతో ఆ నాలుగు మాటలూ అని మోకరిల్లి నున్నటి రాతిబండ మీద తల ఆన్చి రుద్దుకున్నాడు.

లేచి మౌనంగా ముందు నడిచాడు. కనుచూపు అందిన దాకా బళ్లు బళ్లే!

పిల్లలు బండ్ల మీంచి దూకుతూ గంతులు పెడుతున్నారు.

ఆడవాళ్లు చెవులు దిబ్బులు పడేట్టు కేకలు పెడుతున్నారు.

ఇహ కదుల్దామా అన్నట్టు చూశారు జనం రంగయ్యకేసి.

గట్టిగా నిట్టూర్చి "బయల్దేరండి!" అన్నాడు రంగయ్య.

"ఓహోయ్!" అని పెద్దగా కెకపెట్టి తల గుడ్డ తీసి ఊపాడు వెంకట సుబ్బయ్య.

ఊరు కదిలింది.

000

కోట్లకుకోట్ల ఖర్చుతో ఒక మహాసాగరం తయారవుతూ ఉంది అక్కడ. దేశదేశాలూ తరతరాలుగా చెప్పుకొనే ఒక మహాయాగం జరిగిపోతూంది. యుగయుగాలుగా బీడు పడి ఉన్న భూములు పచ్చని పైరులతో జాతిజాతిని ఉద్ధరించబోతున్నాయి.

అలాంటి సాగరంలో చరిత్ర లేని కొన్ని ఊళ్లు మునిగిపోతూ ఉన్నాయి. ప్రభుత్వం చేయగలిగిందల్లా చేస్తూంది నిర్వాసితుల కోసం. భూములకూ, కట్టడాలకూ విలువ కట్టి ఇచ్చింది. ఒక్కో కుటుంబానికి అయిదెకరాల భూమి ఉచితంగా పంచి ఇచ్చింది. అన్ని సౌకర్యాలతోనూ కొత్త ఊళ్లు కట్టి ఇస్తూ ఉంది.

కాని, తాము పుట్టి పొర్లాడిన ఆ మట్టిని, తమకు రక్తమాంసాలు ప్రసాదించిన ఆ మట్టిని, తమ తాతముత్తాతలను జోలపాడి నిద్రపుచ్చిన ఆ మట్టిని వీడిపోడానికి మనస్సు ఒప్పడంలేదు జనానికి. హృదయాలన్నీ ఎన్నో స్మృతులతో బరువెక్కి మూగగా రోదిస్తూ ఉన్నాయి.

**ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 21.3.1962 సంచికలో ప్రచురించాము.**

ఆ బాధ వాళ్లకే తెలుసు!

000

బళ్లు చేల మధ్య పడి పోతూఉన్నాయి. రంగయ్య ఆఖరి బండిలో కూచుని ఉన్నాడు. పోలిగాడు బండి తోలుతూ ఉన్నాడు. వాడి వెనకాల కొడుకు శంకరం కూర్చుని కబుర్లు చెబుతున్నాడు.

కోడలు పిల్లవాణ్ని పొదువుకొని, ఉదయపుటెండ మీద పడకుండా పైట చెంగు కప్పింది. పెద్ద మనవడు రంగయ్య ఒళ్లో కూర్చుని కృష్ణ ఒడ్డుకేసి చూస్తూ ఉన్నాడు. మనవరాలు తనకేమీ కనిపించడంలేదని వీపు వెనక చేరి గోల చేస్తూంది.

ఊరు దూరమైపోతూ ఉంది. ఇళ్లూ, పొలాలూ, క్షణక్షణానికీ తననుండి దూరంగా జరిగిపోతున్నాయి. జవుకుబావి దగ్గర ఎడ్లు ఆగి నిలబడిపోయినయ్. వాటిని అదుపులోకి తెచ్చి మళ్లీ బయలుదేర దీయడానికి నానా అవస్థాపడుతున్నారు పోలిగాడూ, శంకరమూ కలిసి.

ఈ మూగజీవాలకు కూడా తెలుసునేమో తాము ఊరు వదిలేసిపోతున్నామని. మధ్యాహ్నం వేళ ఎక్కడెక్కడి గొడ్లూ జవుకుబావి దగ్గర చేరతయ్ నీడ కోసం. రోజూ ఆ బావి దగ్గరకొచ్చేసరికి అవి తోకాడిస్తూ, ఎంతో ఆనందంగా అదో రకంగా చూస్తాయి.

మళ్లీ వాటంతట అవే అర్థం చేసుకున్నట్టు కదిలిపోసాగాయి ఎడ్లు. తల బల్లకానించి ఏదో లోకంలోకి చూస్తున్నాడు రంగయ్య.

దూరాన కొట్టం తల నరికేసిన మనిషిలాగు నిలబడి ఉంది. దాని ఎదుట ఎనభైయేళ్లపాటు ఊరంతటికీ నీడనూ, న్యాయాన్నీ ప్రసాదించిన వేపచెట్టు దిగాలుపడి చూస్తూ ఉంది. దాని చుట్టూ నున్నటి రాతిబండలు క్షణక్షణానికీ చిన్నవైపోతూ ఉన్నయ్.

చెట్టు మీద నుండి గబుక్కున లేచి ఎగిరిపోసాగింది ఒక గద్ద-ఊరంతా పోగా నేను మాత్రం ఇక ఇక్కడెందుకన్నట్టు.

రంగయ్య కళ్లు రెండూ నీళ్లతో నిండిపోయాయి. వేపచెట్టు-ఎంత గాథ ఉంది దాని వెనుక!

రంగయ్య తండ్రి చెబుతూ ఉండేవాడు, తనకు ఆరేళ్ల వయస్సప్పుడు వాళ్ల నాయన ఆ చెట్టును ఎక్కణ్నించో తెచ్చుకుని నాటాడని. ఆ నాటి నుండి అయిదో తరం వాళ్లయిన తన మనవళ్లను చూసిందా చెట్టు.

తన జ్ఞాపకానికి అందిన మొదటి సంఘటన అది: ఒక ఉగాదినాడు ఇంటినిండా జనం ఉన్నారు. ఏటి అవతలనుంచి మామిడి కాయలు పంపాడు మావయ్య. తనూ, సిద్ధయ్యా కలిసి వేపపూవు కోస్తున్నారు.

పూత కోస్తూ ఒళ్లు తెలియకుండా చిటారుకొమ్మకెళ్లిపోయాడు రంగయ్య.

ఉన్నట్టుండి ఫెళ్లున విరిగింది కొమ్మ.


ఏం జరిగిందో తెలుసుకోక ముందే తను గాలిలో ప్రయాణం చేస్తున్నాడు భూమికేసి. ఉన్నట్టుండి ధడాలున పట్టుకుంది పంచెను ఓ కొమ్మ. అలాగే వేలాడసాగాడు ముప్ఫయ్ అడుగుల ఎత్తు నుంచి. ఏదో చేయాలని ప్రయత్నం చేస్తున్నాడు కానీ, చేతులు కదలడంలేదు. నోరు పెగలడంలేదు.

ఈలోగా సిద్దిగాడు సంగతి కనిపెట్టి కేకలు పెడుతూ చెట్టు మీంచి దూకి పరుగెత్తసాగాడు.

మరో పది క్షణాల్లో పెద్ద గుంపు తయారైంది చెట్టుకింద. వెర్రి కేకలు పెడుతున్నారు ఆడవాళ్లు.

రంగయ్య తల్లి గుండెలు బాదుకుని పిచ్చి పట్టినట్టు ఏడుస్తూ ఉంది. మగాళ్లు అటూ ఇటూ పరుగెడుతున్నారు.

తన జీవితం అంతటితో ఆఖరేననుకున్నాడు రంగయ్య. పన్నెండేళ్ల వయస్సులో అంత గుండె నిబ్బరంగా ఉండగలిగే వాళ్లు అరుదు. గుడ్లు తేలేసి



జీవం లేనట్టు చూడసాగాడు నేలకేసి.

ఈలోగా ఓ ఇరవై మంది నెత్తి మీద చొప్ప కట్టెలు మోసుకునివ చ్చి నేల మీద పారేశారు. మరి కొందరు చెట్టెక్కి తను వేలాడుతున్న కొమ్మ మీదికి రావడానికి ప్రయత్నం చేస్తున్నారు. కానీ, ఆ కొమ్మ ఒకడి బరువుకే విరిగిపోయేటట్టుగా ఉంది. ఇంకో మనిషి కూడా ఎక్కాడంటే అనుమానం లేకుండా కూలి పడుతుంది. అందువల్ల తనను అందుకునే ప్రయత్నం విరమించుకుని కింద చొప్పకట్టెలే జోరుగా వేయసాగారు. ఒక నిలువెత్తున చొప్ప పరిచి దాని మీద కాస్త ఎండుగడ్డి సర్దారు.

కానీ ఇంత జరిగినా తను కింద పడలేదు. పంచె పట్టు మీద అలా వేలాడుతూ ఉన్నాడు.

జనం కూడా గడ్డి పరిచి ఇహ తాము చేయగలిగిందేమీ లేదన్నట్టు చూడసాగారు. ఒకాయన కొమ్మ నరుకుదామని బయలుదేరాడు కానీ, ఆ కొమ్మ విరిగి నడుంమీద పడితే ఇహ ప్రతకటం కల్ల. అందువల్ల ఆ ప్రయత్నం కూడా మానేసి మోరలు చాచి పైకి చూస్తూ నిలబడ్డారు.

కాసేపటికి రంగయ్యకే ఏదో తట్టింది. మెల్లగా చేతులు కదలసాగాయి. వెండి మొలతాడు పొట్ట మీదికి లాక్కుని పంచె వదులుచేశాడు. దానితో పంచె ఊడిపోయి గడ్డి మేటు మీద బోర్లాపడ్డాడు.

జనం ఒక్క ఉదుటున గడ్డి మేటు మీదకెక్కి కిందికి లాగారు రంగయ్యను. మోసుకెళ్లి అరుగు మీద పడుకోబెట్టారు. మొహం మీద నీళ్లు చల్లారు.

కానీ అతను మాత్రం ఏమీ చలించలేదు. నిశ్చలంగా చూస్తూ ఉన్నాడు.

కాసేపటికి రంగయ్య తండ్రి యాదగిరి రంగయ్యను లేపి, మొలకొక గుడ్డ చుట్టి, వేపచెట్టు దగ్గరికి తీసుకుపోయి పిల్లవాడిని బోర్లాపడేసి, తను మోకరిల్లి, మూగగా ఏదో అన్నాడు.

ఆయన కళ్లల్లో తనకు అర్థం కాని భావం ఏదో కనిపించింది రంగయ్యకు. తనూ మొహం ఎత్తి చెట్టుపైకి చూశాడు-పైన పంచ గాలికి ఊగుతూ ఉంది.

అంతసేపూ తనను ఒడిసి పట్టుకున్న కొమ్మ వంగి వేలాడుతూఉంది. దాదాపు విరిగినట్టే ఉందది.

అంతవరకూ లేని భయం అప్పుడు ఒక్కసారిగా విద్యుత్తులాగు ప్రవహించిందతనిలో. ఒళ్లు గగుర్పొడిచింది.

వినయంగా తల వంచి తనూ నమస్కరించాడు. ఆ నాటి నుండి ఏదో మహాతల్లి కనిపించేది ఆ చెట్టులో రంగయ్యకు.

డొంక దగ్గర బండి చక్రం గాడి తప్పి రాతి మీదకెక్కి ఎగిరిపడింది.

అదిరిపడ్డాడు రంగయ్య. పిల్లవాణ్ని రెండు చేతులతో పొదువుకుని మళ్లీ ఏమీ జరగనట్టే ఊరికేసి చూడసాగాడు.

దూరంగా ఏటి ఒడ్డున చాకిరేవు కనిపిస్తోంది.

000

సిద్దయ్య చెల్లెలు గంగి గమ్మత్తయిన మనిషి. పుష్టిగా కుదించిన ధాన్యపు బస్తాలాగుండేది. మనిషి లావయినా ఎంతో హుషారుగా ఉండేది. కళ్లల్లో ఏదో చిలిపితనం మెరిసిపోతూ ఎదటివాళ్లను కవ్విస్తూ ఉన్నట్టుంటుంది.

చెరువు కింద మాగాణిలో నాట్లు జరుగుతూ ఉన్నయ్ అప్పుడు. కూలీల నందర్నీ పంపించేసి, గట్టుమీద నడిచి వస్తున్నాడు రంగయ్య ఇంటికి. మసక చీకటిలో ఒంటరిగా నడుస్తూంటే ఏదో గుబులుగుబులుగా ఉంది.

ఇంతలో వెనక బరువైన అడుగుల చప్పుడయింది. వెనక్కు తిరిగి చూసీ చూడనట్టు చూశాడు. గంగి ఆదరాబాదరా పరుగెత్తుకుంటూ వస్తుందీ పుల్లల మోపు నెత్తినేసుకుని.

తను ఏమీ ఎరగనట్టే నడవసాగాడు.

గంగి వేగంగా నడుస్తూ రంగయ్య దగ్గర కొచ్చేసింది. కానీ దాటడానికి మొహమాటపడుతూ ఉంది. దారి ఇమ్మని ఆడుగుదామనుకుంది గానీ, ఏదో సిగ్గు దొంతర అడ్డుకుని నోరు పెగలనియ్యలేదు. ఎంతసేపటికీ తొలగకపోయేసరికి విసుగేసింది గంగికి. నెమ్మదిగా మోపు ఎడమ భుజం మీదికి మార్చుకుని రంగయ్యకు ఎడమ పక్కగా దారి చేసుకుపోయింది.

నల్ల రేగడి మట్టి నీళ్ల సావాసం పడితే ఎలా ఉండేదీ చెప్పనక్కరలేదు. గట్టు మీద కుడి కాలు మోపి ఎడమ కాలు ఎత్తేసరికి జర్రున జారి చేలోకి పడిపోయింది. కట్టెల మోపు దభాలున రంగయ్య కాళ్ల మీద పడింది.

"అమ్మా!" అన్నాడు బాధకు రంగయ్య.

పక్కకు తిరిగి చూసేసరికి గంగి బురదలో పొర్లాడుతూ పైకి లేవడానికి నానా అవస్థా పడుతూంది. పరుగెత్తుకుంటూ పోయి రెండు చేతులతోటీ భుజాలు పట్టుకు లేవదీశాడు. నెమ్మదిగా నడిపించుకొచ్చి సీమచింత చెట్టు పక్కన కూర్చొబెట్టాడు. తాను పక్కనే కూర్చుని నలిగిపోయిన తన ఎడమకాలి బొటనవేలికి కట్టు కట్టుకుంటున్నాడు.

ఈలోగా గంగి పోయి పక్కనున్న దిగుడు బావిలో ఒళ్లు కడుక్కొచ్చింది. తిన్నగా వెళ్లి మోపు దగ్గర నిలబడి అలాగే చూస్తూ ఉంది. ఒక్కతే ఎత్తుకోవడానికి వల్లకాదు. అతన్ని అడగను నోరు రావడం లేదు.

రంగయ్య సంగతి తెలుసుకుని తనే వెళ్లి మోపు నెత్తిన పెట్టాడు. నెత్తి మీద పెట్టేటప్పుడు నాలుగు కళ్లూ కలుసుకున్నాయి. గంగి కళ్లల్లో కోపం, కృతజ్ఞత, సిగ్గు, అన్నీ కలగాపులగం అయి రంగయ్యను ఒక్క కుదుపు కుదిపాయి.

ఊళ్లోకొచ్చేదాకా ఎవ్వరూ మాట్లాడలేదు.

గంగి నడుస్తూ ఉంది ముందు. రంగయ్య వెనకాలే కళ్లింత చేసుకు చూస్తూ అదో రకం మైకంలో పడి కొట్టుకుంటున్నాడు.

కుమ్మరి వెంకయ్య ఇంటి ముందర సందు మలుపు తిరిగి గూడెంలోకి వెళ్లబోతూ, "నీ ఏలు రగతం.." అని సణిగింది గంగి.

రంగయ్య నవ్వుతూ, "పరవాలేదులే!" అన్నాడు. ఎండిపోయిన గొంతులోనుంచి మాట సరిగా పెగిలి రాలేదు.


రోజూ అలాగే అనుకోకుండా కలుసుకునేవారు గంగీ రంగయ్యానూ. స్నేహం ముదిరి పాకాన పడసాగింది.

ఊళ్లో గుసగుసలు బయలుదేరాయి. యాదగిరి ఒకనాడు కొడుకుని పిలిచి చీవాట్లు పెట్టాడు.

రంగయ్య ఆ ఉద్రేకంలో ఎదురుతిరిగి మాట్లాడాడు.

దానితో యాదగిరి రెచ్చిపోయి, "చూసుకో, రేప్పొద్దుటికల్లా దాన్ని ఊళ్లో లేకుండా చేస్తాను!" అని బెదిరించాడు.

రంగయ్య హడలిపోయాడు. రాత్రికి రాత్రే గంగిని కలుసుకుని వ్యవహారం చేతులు దాటిపోయిందని చెప్పాడు.



గంగి కళ్లలో నీళ్లు నింపుకుని జాలిగా చూసింది.

కాసేపు నిశ్శబ్దంగా చూసి గబుక్కున ఒక నిర్ణయానికి వచ్చి, "లే, గంగీ! రెండు జతల గుడ్డలు తీసుకుని బయలుదేరు. చూద్దాం, వీళ్ల ఆసరా లేకుండా ఎందుకు బతకలేమో!" అన్నాడు.

గంగి ఉలిక్కిపడి చూసింది. అలాగే వెర్రిదానిలా అతని మొహంలో ఏదో వెదుకుతున్నట్టు చూసింది కాసేపు. ఆ తర్వాత గిరుక్కున తిరిగి ఇంట్లోకి పోయింది.

రంగయ్య ఆశ్చర్యపడ్డాడు. గంగికి కోపమొచ్చిందనుకున్నాడు. తాను తొందరపడ్డానేమోననుకున్నాడు. కానీ ఇంతలో గంగి చిన్న సంచి పట్టుకుని వచ్చేసింది దొడ్డి గుమ్మం గుండా.

పట్నంలో బతకడం అంత తేలిగ్గా అవుపించలేదు రంగయ్యకు. చేతికి ఉన్న రెండు ఉంగరాలతో ఒక నెల రోజులు దొర్లిపోయాయి. కానీ ఆ తర్వాత ఏం చేయాలో అర్థం కాలేదు. ఉద్యోగం కోసం ఊరంట తిరిగాడు. కానీ ఏం ఉద్యోగం చేయాలో తనకే బోధపడేది కాదు. ఆకలి బాధ ఏ ఉద్యోగమైనా పరవాలేదంది. పొగాకు గిడ్డంగుల దగ్గర బేళ్లు లారీకెత్తే కూలీలతో కలిశాడు. కానీ పట్నంలో ఆ కూలి డబ్బులతో జరగటం కష్టంగా ఉంది. తిండికి మొహం వాచి మనిషి పీక్కుపోయాడు. గంగి కూడా తీసుకుపోయి జబ్బున పడింది.

ఈలోగా యాదగిరి ఊళ్లన్నీ గాలించి చివరికి రంగయ్యను కనుక్కున్నాడు. "నువ్వు ఇంటికి రాకపోతే మీ అమ్మ ఇక రెండు మూడు రోజుల్లో మనకి కాకుండా పోతుంది. నా కోసం కాకపోయినా దాని కోసం నడూ-ఇంటికి!" అన్నాడు.

రంగయ్య ఒప్పుకోలేదు.

కానీ యాదగిరి మంత్రం గంగి మీద పనిచేసింది. చెమ్మగిల్లిన కళ్లతో "పద-పోదాం!" అంది.

రంగయ్య ఎంత వారించినా ప్రయోజనం లేకపోయింది.

ఊళ్లో అడుగుపెట్టేసరికి వింత జంతువుల్ని చూసినట్టు చూడసాగారు జనం గంగినీ, రంగయ్యనూ.

యాదగిరి తను బయటపడకుండా ఎంతో నేర్పుగా బిగించాడు ఉచ్చులు.

ఊళ్లో పెద్దలంతా చేరి మర్నాడు పంచాయతీ జరపడానికి నిశ్చయించారు.

రంగయ్య మండిపడ్డాడు. గంగిని తీసుకుని మళ్లీ ఊరు విడిచి పోదామని ప్రయత్నించాడు రాత్రికి రాత్రే.

కానీ గంగిని ఇంట్లో చావకొట్టి స్తంభానికి కట్టి కూచోపెట్టాడు వాళ్ల అన్న సిద్ధిగాడు.

మర్నాడు పంచాయతీ జరిగింది, వేపచెట్టు కింద. యాదగిరికి యాభై రూపాయలు జరిమానా వేశారు. మరో యాభయ్ ..ర్యకు ఇచ్చేట్టు ఏర్పాటు చేశారు. నోరెత్తకుండా కట్టేశాడు యాదగిరి వందరూపాయలూ.

మరో నెల రోజుల్లో ఇద్దరికీ విడివిడిగా పెళ్లిళ్లు చేసే ఏర్పాట్లు చేశారు.

గంగి ఏమంత గొప్ప కులం లోంచి వచ్చిన మనిషి కాదు. అందువల్ల వరుడు దొరకడం అంత కష్టం కాలేదు. కాకపోతే ఓలి డబ్బులు కాస్త తగ్గాయి సిద్ధిగాడికి.

యాదగిరి రెండోరోజు పొద్దుటికల్లా ఏటి అవతల నుంచి మారయ్యను పిలిపించి ముహూర్తం పెట్టేశాడు. పెళ్లి కూతురుకు ఇంకా పదో ఏడు రాలేదు. మారయ్య అనుకోకుండా కలిసి వచ్చిన ఈ అదృష్టంతో గంతులేశాడు.

రంగయ్య నిర్జీవంగా, జరిగిపోయే వ్యవహారాలన్నీ మూగగా చూస్తూ ఉండిపోయాడు.

పెళ్లి ఎంతో సంబరంగా జరిగిపోయింది.

రంగయ్య పెళ్లి జరిగిన మర్నాడు గంగి శవం ఏటి గట్టున చాకిరేవులో కనిపించింది.

ఊరంతా అల్లకల్లోలంగా తయారయింది. గంగి చచ్చిపోయి, బోలెడు సానుభూతి సంపాదించుకుంది. జనం తప్పంతా రంగయ్యదేనని మొహం మీదే తిట్టిపోయసాగారు.

ఎవరికీ జవాబు చెప్పేవాడు కాదు రంగయ్య. ఏటి ఒడ్డున కూచుని గంటలకొద్దీ ఏడిచేవాడు. గొంతెత్తి ఏవో వెర్రి పాటలు పాడేవాడు.

"భోజనాలు పెద్దగూడెంలో చేద్దామా, మావా!" అని వెంకటసుబ్బయ్య పలకరించేసరికి, ఈ లోకంలో పడ్డాడు రంగయ్య. అతనికి జవాబు చెప్పి మళ్లీ సర్దుకు కూర్చున్నాడు.

వేపచెట్టు మెల్లిగా మరుగున పడిపోసాగింది.

రంగయ్య ఏదో గొణగసాగాడు ఎవ్వరికీ వినపడకుండా. అంతకు ముందు రోజు ఒక వింతైన పని చేశాడు తను. పేటలో కమసాలి దగ్గరికి పోయి ఒక రాగి రేకు మీద ఆ ఊరి చరిత్రంతా రాయించాడు. ఎవ్వరికీ తెలియకుండా దాన్ని తీసుకొచ్చి అర్ధరాత్రి పూట వేపచెట్టు దగ్గర రాతిబండ కింద పాతిపెట్టాడు. దాని సంగతే గుర్తుకొచ్చి కళ్లు నీటితో నిండిపోయి ప్రపంచమంతా అలుక్కుపోయినట్టు కనిపించింది.

వేపచెట్టు మాయమైపోయింది.

000

ఆరేళ్లు గడిచిపోయాయి. కొత్త ఊళ్లో జనం స్థిరపడిపోయారు. ఊరంతా ఒక నియమితపద్ధతి ప్రకారం ఎంతో అందంగా తయారయింది. కొత్త భూములను రెండు మూడేళ్లు శ్రమపడి అదుపులోకి తెచ్చుకున్నారు రైతులు. పంటలు బాగానే పండుతున్నాయి. ఊళ్లో చాలామంది పాత ఊరు సంగతి మరిచిపోసాగారు. అయితే కాస్త వయస్సు మళ్లినవాళ్లు మాత్రం ఇంకా మరువలేకపోతున్నారు. అందులో రంగయ్య మరీను.


కొత్త ఊళ్లోకొచ్చి ఇన్నేళ్లు గడిచిపోయినా పూర్వంలాగు పరిసరాలతో ఆత్మీయత కలగడం లేదతనికి. మనిషి నీరసంగా ఎవరో నెట్టుతూంటే నడుస్తున్నవాడిలాగు పనులు చేసుకుంటున్నాడు. వ్యవసాయం చాలావరకు కొడుకే చూసుకుంటున్నాడు. ఏదో పై పనులు మాత్రం తను చూస్తూ ఉన్నాడు.

డాము పూర్తిగా తయారైపోయింది. రేడియోలో వారానికొకసారైనా చెబుతారు ఆ డాము గురించి. వార్తాపత్రికల్లో ఏ రోజు చూచినా దాన్ని గురించి ఏదో ఒకటి రాసి ఉంటుంది. కొత్త ఊరి నుంచి చాలామంది వెళ్లి చూసి వచ్చి ఎంతో గొప్పగా చెప్పారు రంగయ్యకు. కానీ అతనికి మాత్రం వెళ్లడానికి ఏదో బెరుగ్గా ఉండేది. దాని సంగతి తలుచుకుంటేనే గుండెల్లో కెలికినట్టు ఉండేది.

ఓ రోజున బయలుదేరాడు తనూ, అన్నం మూట కట్టుకుని, వేకువజామునే. కొండ దారిని నడిచి డాము చేరేసరికి పది గంటలు దాటింది.

డాము దగ్గర ఊరు విపరీతంగా పెరిగిపోయి ఒక మహానగరంలాగు తయారయింది.

ఎనిమిదేళ్లనాడు అక్కడ నరసంచారం కూడా ఉండేది



కాదు. పెద్దపులులూ, తోడేళ్లూ ఎక్కడ పడితే అక్కడ కనిపించేవి. కొండచిలువలు కూడా కనిపించేవంటారు కొందరు.

ఓ కుళాయి దగ్గర కూర్చుని అన్నం తిన్నాడు రంగయ్య. బజార్లన్నీ తిరిగి డాము దగ్గరికి చేరుకున్నాడు. రెండు పర్వతాలను కలుపుతూ ఇంకో పర్వతం వెలసినట్టుందక్కడ. సృష్టికి ప్రతిసృష్టి చేసినందుకు కోపంగా మనుషుల మీద రంకెలు పెడుతూందా అన్నట్టు ఏదో భయంకరమైన ఘోషతో చెవులు దిబ్బెళ్లు పడిపోతున్నాయి. తాను సముద్రం చూశాడు కానీ అక్కడ కూడా ఇంత శబ్దం లేదు.

డాము మీద బ్రహ్మాండమైన రోడ్డు వేశారు. లారీలూ, కార్లూ పిచ్చి పట్టినట్టు తిరుగుతున్నాయి దానిమీద. ఒక పక్కన రైలుపట్టాల లాంటివి రోడ్డు పొడుగునా వేసి ఉన్నాయి. లోపలి వైపు పెద్ద పెద్ద ఉక్కుచట్రాలు బిగిస్తున్నారు కొంతమంది. ఇనుపదూలాల మీద సుత్తెలతో బాదుతూ ఉంటే గూబలు పగిలేటట్టు శబ్దం అవుతూ ఉంది. ప్రతివాడూ ఏదో కొంపమునిగిపోతున్నట్టు అటూ ఇటూ పరుగెడుతున్నాడు.

రంగయ్యకు అంతా అయోమయంగా ఉంది. ఏదో ఊహాలోకంలో తిరుగుతున్నట్టు అనిపించసాగింది. ఇదంతా నమ్మదగిందేనా అనిపిస్తూంది.

డాముకు అవతలి వైపు ఒక మహాసముద్రం కనిపించింది. ఏటు చూసినా నీళ్లు-నీళ్లే! ఒడ్డనేది కనిపించడం లేదు. నీళ్లు నిశ్చలంగా ఏదో సమాధిలో ఉన్నట్టు ఉన్నాయి. మిట్టమధ్యాహ్నపుటెండ నీటి మీద పడి వెండి రేకులు గాలికి ఊయలలూగుతున్నట్టుగా ఉంది. బిడ్డను నిద్రపుచ్చే తల్లి చిచ్చిగొడుతున్నట్టు గోడకేసి నీళ్లు కొట్టుకుంటూ ఉన్నాయి. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన చెత్తా, చెదారం, ఆకూ, అలమూ ముగిగిపోయి గోడ దగ్గర తెట్టెలు కట్టుకుపోయింది.

రంగయ్య ఆ సాగరంలోకి వెర్రిగా చూశాడు. నీళ్లు తప్పితే ఇంకేమీ కనిపించడం లేదతని కళ్లకు. ఆరేళ్ల నాడు ఇదే చోట నిలబడి చూస్తే తన ఊరూ, తన వేపచెట్టూ కొట్టవచ్చినట్టు కనిపించేవి. అంతే కాదు. వాళ్లు ఊరికి అవతల రెండు మూడు ఊళ్లు కూడా లీలగా కనిపించేవి. ఈ నాడు ఏమీ లేదక్కడ.

అదుగో ఆ మూలే-ఆ గద్దలు ఎగిరే దగ్గరే-తన ఊరు ఉండేది. అక్కడ తను పుట్టి పెరిగి ఆడిపాడింది. తనకు తీర్పులు చెప్పిన శిక్ష వేసిన చోటు వేపచెట్టుఅక్కడే ఉంది. తనను నమ్మి నాశనమైపోయిన గంగీ వాళ్ల గుడిసె అక్కడే ఉంది. గంగి-తన కళ్లల్లోకి లేడిపిల్లలాగు చూచే గంగి.

గిర్రున నీళ్లు తిరిగాయి కళ్లలో. ఊళ్లో ప్రతి రాయీ ప్రతి చెట్టూ తనకు తెలుసు. అవన్నీ ఉన్నపళంగా ఈ నీటికి బలైపోతాయని ఎప్పుడూ అనుకోలేదు తను. కొత్త ఊరు ఎంత అందంగా ఉంటేనేం? తనదిగా కనిపించదది. ఏదో చుట్టాల ఇంటికి పోయినట్టు ఉంటుంది అక్కడ.

ఒక్కసారిగా తన ఊరు కనిపిస్తే ఎంత బావుణ్ను, ఒక్కసారి! వేపచెట్టు కింద రాతిబండల మీద కూర్చుంటే ఏదో సింహాసనం ఎక్కినట్టు ఉండేది తనకు. ఇహ ఈ జన్మకు కనిపించవు అవి.

ఎంత ఆపుకుందామన్నా ఆగకుండా ఏడుపు పెల్లుబుకుకొచ్చింది. ఎక్కిళ్లు పెట్టి ఏడుస్తూ పిచ్చి పట్టినట్టు పిట్టగోడమీది కెక్కసాగాడు. పోవాలి, పోయి ఒక్కసారి చూడాలిచూసి తీరాలి-ఏమైనా సరే! పిట్టగోడ మీద కెక్కి కాలు ఎత్తాడు రంగయ్య.

ఏదో మహాశక్తి ఒక్క ఊపు ఊపినట్టయింది. గిర్రున పడిపోయాడు. కళ్లు బైర్లు కమ్ముకుపోయాయి. స్పృహ తప్పిపోయింది.

కళ్లు తెరిచేసరికి ముఖం మీదికి వాలి చూస్తున్నాయి రెండు కళ్లద్దాల కళ్లు. ఇంత లావాటి కళ్లజోడుతో, చెమట్లు కమ్ముకుపోయిన ముఖంతో ఆదుర్దాగా చూస్తున్నాడాయన. దుస్తులూ అవీ చూస్తే ఎవరో ఆఫీసరులాగు ఉన్నాడు.

ఎక్కడో చూసినట్టుగా ఉందా ముఖం. రంగయ్యకు ఆశ్చర్యంగా ఉంది. ఏమయ్యాడు తను? ఎక్కడున్నట్టు?

''ఎక్కడో చూసినట్టుంది నిన్ను!'' అన్నాడాయన.

రంగయ్యకు టక్కున గుర్తుకొచ్చింది. అవును, ఆయనే! పెద్ద ఇంజనీరుగారు. వాళ్ల ఊరికి కూడా వచ్చాడు ఒకసారి. తను ఆయన ఆఫీసుకు పోయి పిటిషను కూడా ఇచ్చాడు!

''మా ఊరు వచ్చారు కాదా బాబూ, ఒకసారి!'' అన్నాడు రంగయ్య నూతిలోనుంచి మాట్లాడుతున్నట్టు.

''ఏ ఊరు?''

చెప్పాడు.

''ఆఁ, అవును... ఇప్పుడు గుర్తొచ్చింది రంగయ్యా... మీ ఇంట్లో మేకపాలు తాగాము కదా, రంగయ్యా!'' అన్నాడాయన నవ్వుతూ.

''నేను చచ్చిపోలేదా బాబూ?'' అన్నాడు రంగయ్య దీనంగా.

''లేదు, నీ వాలకం గమనిస్తూనే ఉన్నాను నేను క్రేను దగ్గర నిలబడి. సమయానికి వెనక్కి లాగకపోతే అన్యాయంగా చచ్చిపోయేవాడివే! అయినా ఎందుకీ అఘాయిత్యం తలపెట్టావు? పెద్దవాడికి నీక్కూడా ఈ ఉద్రేకాలు తగ్గకపోతే ఎట్లా?''

రంగయ్య మాట్లాడలేదు. మౌనంగా లేచి కూర్చున్నాడు. గుడ్డలు సర్దుకుని తాబేటికాయ తీసుకుని లేచి నడవసాగాడు ఆయన ఉనికినే గమనించనట్లు.

''ఎక్కడికి పోతున్నావు?'' అన్నాడాయన కొంచెం కోపంగా.

''ఇంటికి బాబూ!''


''మళ్లీ దూకవని నమ్మకమేమిటి?''

రెండు క్షణాలు ఆయన కళ్లల్లోకి ఏదో వెదుకుతున్నట్టు చూచాడు రంగయ్య. తన బాధ అర్థమైనవాడిలా, జాలిగా, ఆతురతగా చూస్తున్నాడాయన.

ఒక్కసారి ఒళ్లంతా కంపించిపోయింది రంగయ్యకు దుఃఖంతో. భోరున ఆడదానిలా ఏడవసాగాడు.

ఆయనేమీ మాట్లాడకుండా అలాగే చూస్తూ ఉన్నాడు. రెండు నిమిషాల్లో తనే తేరుకుని కళ్లు తుడుచుకున్నాడు రంగయ్య తల గుడ్డతో.

''రంగయ్యా! కారణం అడిగేకొద్దీ బాధ ఎక్కువే అవుతుందని తెలుసు నాకు. నువ్వు చెప్పదలుచుకుంటే చెప్పు. లేకపోతే పద! దిగి



ఆఫీసుకు పోదాం. కాస్త కాఫీ తాగితే నరాలు కుదుటపడతాయి!"

"ఏం లేదు, బాబూ! పుట్టి పెరిగిన మట్టి గంగపాలైపోయిందని ఏదో దిగులేసి ఒళ్లు తెలియకుండా పోయింది. చచ్చిపోదామని నా కెప్పుడూ లేదండీ!" అని మొహం పక్కకు తిప్పుకున్నాడు.

శర్మగారికి అర్థం అయింది రంగయ్య బాధ. ఊళ్లు ఖాళీ చేయించే పని ఆయన చేతుల మీదుగా జరిగింది. వాళ్ల సమస్యలూ, వాళ్ల మనోభావాలూ ఆయనకు బాగా తెలుసు. రంగయ్య అంతకన్నా ఎక్కువ చెప్పవలసిన అవసరం లేకపోయింది.

జీపు తెప్పించి రంగయ్యను ఎక్కించుకుని, కొండ దిగి పవర్ హౌస్‌లోకి తీసుకెళ్లాడు. పవర్‌హౌస్‌లో ఓ మూల ఉంది ఆయన ఆఫీసు. కాఫీ తాగేసరికి రంగయ్య కాస్త కుదుటపడ్డాడు.

రంగయ్యకు పవరు హౌసు చూపించాడు శర్మగారు. బ్రహ్మాండమైన సిమెంటు దూలాలూ, స్తంభాలతో ఓ మాయామందిరం లాగుంది ఉందది.

"సాగరం లోంచి నీళ్లు అదిగో ఆ కాలవ ద్వారా దేశం నలుమూలలకీ వెళతాయి. వెళ్లే ముందు ఇక్కడో బ్రహ్మాండమైన కార్యం చేసిపోతాయి. ఆ కనిపించే గొట్టాల లోంచి దూకి విద్యుచ్ఛక్తిని ప్రసాదించిపోతాయి. ఈ పవర్ హౌసులో పుట్టే కరెంటు ఆరు జిల్లాలకి పూర్తిగా సరిపోతుంది. ఒక్క గ్రామం మిగలకుండా విద్యుత్తుతో నింపేయవచ్చును. ఇందాక నువ్వు దూకడానికి ప్రయత్నించినప్పుడు చూశావుగా, ఆ నీళ్లు ఏమీ ఎరగనట్టు ఎంత అమాయకంగా ఉన్నాయో! ఆ నీళ్లే రంగయ్యా, దాదాపు కొన్ని లక్షల కుటుంబాలకి కూడుపెడతాయి. ఊరూరా వెలుగును పంచిపెడతాయి.

"ఇదే నీళ్ల తాకిడికి గిర్రున తిరిగే యంత్రం. ఓ మారు ఏమయిందో తెలుసా? పెళ్లి చేసుకుని ఆరు నెలలు కూడా కాలేదు పాపం! ఓ కుర్రాడు యంత్రం లోపల పని చేస్తున్నాడు ఆగి ఉన్నప్పుడు. ఇంతలో పొరపాటున స్విచ్చి వేశారు పైన ఉన్న వాళ్లు. ఆ కుర్రాడు ఏమైనాడనుకున్నావు? ఏమోఏమయ్యాడో? అతన్ని గురించి చెప్పేందుకు ఓ రక్తం మరక కూడా మిగల్లేదు అందులో. అంత శుభ్రంగా జీర్ణించుకుందా యంత్రం!

"అలా ఇదయిపోతావేం రంగయ్యా! ఇలాంటి చావుకు కొత్త కాదిక్కడ. నెలకొకడైనా ఎక్కడో ఒక చోట బలి అయిపోతూనే ఉంటాడు. ఓ మారు రాళ్ల లారీ బోల్తాపడి ఆరుగురు మనుషులు ముక్కలుముక్కలైపోయారు. ఇంకోసారి బోటు మునిగి నలుగురు అంతు లేకుండా పోయారు. అదుగో, ఆ తీగలు కనిపించేచోట పదిమంది ఓ ఇనుక దూలం మోసుకొస్తూ కరెంటు తీగ తగిలి అక్కడి కక్కడే.."

"ఇక చాలు బాబూ!" వెర్రి కేక పెట్టాడు రంగయ్య.

"విన్నందుకే ఇంత బాధపడుతున్నావు నువ్వు. ఇవన్నీ కళ్లారా చూసినవాణ్ని నాకెలా ఉంటుందో చెప్పు రంగయ్యా!

"నిజమే. ఈ ప్రాజెక్టు నుంచి ఇంతమంది నష్టపడ్డారు. కానీ మొత్తంమీద జనం ఎంత బాగుపడిందీ నీకు తెలుసును. పదేళ్ల నాడు రెండువందలు అమ్మే ఎకరం ఇవ్వాళ మూడువేలు! కరవుతో నానాగడ్డీ తిని అల్లాడిపోయే లక్షలాది జనానికి కడుపు నిండా కూడు దొరుకుతోందిప్పుడు. కొన్ని వేలమంది ఉద్యోగాలు సంపాదించుకుని హాయిగా బతుకుతున్నారిక్కడ.

"రాక్షసుల్ని వధించేందుకు రాముడెన్ని కష్టాలు పడ్డాడో రంగయ్యా! ఆయన సైన్యంలో ఎవ్వరూ గాయపడకుండానే చేయగలిగాడా పనిని? మన కూడా అంతే-కరవుకాటకాల మీద యుద్ధం ప్రకటించాం. మనలో కొందరు నష్టపోవచ్చు. కానీ మన తరువాతి తరం వాళ్లు ఎంత సుఖపడతారు! మరో తరందాకా ఎందుకు? ఇప్పుడే కనిపిస్తోంది కదా!"

పవరుహౌసు మూడో ద్వారం గుండా బయటికొచ్చారు. డాము హిమాలయపర్వతమంత ఎత్తున కనిపిస్తుంది. మధ్య గేట్ల గుండా బోనులోంచి ఆకలిగొన్ని సింహాలు దూకినట్టు దూకుతూఉన్నాయి నీళ్లు, భూమి దద్దరిల్లేటట్లు ఘోష పెడుతూ.

"అదిగో... ఆ కేకలు పెట్టే నీరు మనల్ని చూచి ఇంకా గేలి చేస్తూనే ఉంది. ఆ నీరంతా ఎందుకూ పనికి రాకుండా సముద్రంలోకి పోతున్నదన్నమాట. ఇలా రా, జనానికి ఉపయోగపడే నీరు ఎలా పోతోందో చూపిస్తాను!"

చుట్టూ తిరిగి పవరు హౌసు ముందుకొచ్చారు. తూముల్లోంచి నీరు దూసుకువచ్చి సుళ్లు తిరిగి, వెర్రి గంతులు పెట్టి అరఫర్లాంగు దూరం పోయేసరికి, ఏదో జీవితసత్యం తెలుసుకున్న వేదాంతిలాగు, నిశ్శబ్దంగా, గంభీరమైన హుందాతనాన్ని అలవాటు చేసుకుని కాలవలోకి పోసాగింది. మూరెడు పొడుగు చేపలు ఊపిరాడక పిచ్చిగంతులు పెడుతున్నాయి ఆ సుడిగుండాల్లో.

"చూశావా, రంగయ్యా, ఆ నీటికి ఈ నీటికీ తేడా!"

రంగయ్య మాట్లాడలేదు. మౌనంగా నీటి మీదికి వంగి కళ్లకద్దుకుని మూడు దోసిళ్ల నీరు తాగాడు. తాబేటికాయ నిండా నింపుకున్నాడు.

లేచి నిలబడి శర్మగారికేసి రెండు క్షణాలు దీక్షగా చూశాడు. ఆ తర్వాత రెండు చేతులూ జోడించి "వెళ్లొస్తాను బాబూ!" అని బయలుదేరాడు ఇంటికి.

శర్మగారు అలాగే నిలబడి వెళ్లిపోయే రంగయ్యను చూస్తూ ఉన్నాడు. ఆయన ముఖం మీద ఏదో తృప్తి మెరిసిపోతూంది. అయితే కళ్లద్దాల వెనక కన్నీటి ఛాయలు కూడా కనిపిస్తున్నాయి.

"ఈ షిప్టువాళ్లు వెళ్లిపోతున్నారండీ! రెండో షిప్టువాళ్లు వచ్చేశారు పన్లోకి!" అంటూ ఒక్కడ కొచ్చాడు ఒక టోపీ ఆయన.

శర్మగారు అతనికేసి చూడలేదు. రంగయ్య పోయే దిక్కుకే చూస్తూ ఉన్నాడు ఇంకా. ఒక్క నిముషం అలాగే చూసి గట్టిగా నిట్టూర్చి, "అవును, షిఫ్ట్ మారింది!" అన్నాడు. ■

